# ముత్తాయి కూతురు

ఆ గుంటుపల్లి పల్లెటూరుకు కొంచెం పెదగావున్న మాలపల్లిలో ఓ మూలగుడిసెలోంచి తెల్లవారి చద్దిబువ్వ తిని, పైపంచతో మూతి తుడుసుకుంటూ బయిటికి వొచ్చాడు మాదిగ ముత్తాయ్.

గుడిసె పక్కన సాయిమేకుకు కట్టివున్న బఱ్రెపడ్డకు నాలుగు గడ్డిపరకలువేసి మునుసుబు కచేరి నౌకరుపనికి పోదామనుకుంటున్న ముత్తాయికి మట్టిగాబు దగ్గిర రొచ్చులో దిగి, ముంతతో గాబులో నీళ్ళు తాగుతున్న తన నాలుగేళ్ళ కూతురు లచ్చి కనిపించింది.

"అప్పుడే తెల్లారిందంటే నీకు గాబుకాడికి చేర్దానికీ? మీ అమ్మ సూసిందంటే చంపుద్ది, రా ఇటు" అన్నాడు ముత్తాయ్ బఱ్రెపడ్డకు గడ్డిపరకలువేస్తూ.

"ఈ లచ్చిముండ అప్పుడే గాబుకాడికి చేరిందీ? ఒత్తున్నా, ఇయాల దీనికి మూడిందే" అంటూ గుడిసెలోంచి, ముత్తాయ్ పెళ్ళాం మాణిక్యం కేకేసింది.

ముంత గాబులో దభీమని పారేసి బురదకొట్టుకొంటూ గబగబ ముత్తాయ్ దగ్గిరకు పరెగెత్తుకొచ్చింది లచ్చి.

"చీ, నీ బురద సేతుల్తో నన్ను ముట్టుకోమాక" అంటూ కూతురుకు దొరక్కుండా పక్కకు తప్పుకుంటున్నాడు ముత్తాయ్ నవ్వులాటగా.

"మరి నాకు చెనగపప్పు తెచ్చి పెత్తానంతే".. అంటూ బురద చేతుల్తో ముత్తాయ్ వెంటపడింది లచ్చి పెద్ద పెట్టున కేరింతలు కొడ్తూ.

"ఆసి సచ్చిందానా, ఇంకా తెల్లగా తెల్లార్నన్నాలేదు అప్పుడే ఒల్లంతా బురదపూసుకుండా? ఇయ్యాల నీ ఈపు పగిలిందే- ఒత్తున్నా వుండు" అంది గుమ్మంలోకొచ్చిన మాణిక్యం, చూర్లోంచి తాటిమట్ట తీసుకుని లచ్చి దగ్గిరకొస్తూ.

"అయ్యా, అయ్యా" అనరుస్తూ మాణిక్యానికి దొరక్కుండా తప్పించుకుని ముత్తాయిని గభాల్న వాటేసుకుంది లచ్చి.

“అయ్యో, సచ్చిందానా, అయ్య పంచకు బురద పుయనే పూశావుగందే! ఉండు నీకు రాసింది”... అంది మాణిక్యం లచ్చిమీదికొస్తూ.

‘ఏహె ఉండు ఏంది నీ రగడా” అంటూ లచ్చి ఒళ్లు తడివి “పిల్లకు ఒళ్ళు ఎచ్చగా ఉందేమే?” అన్నాడు ముత్తాయ్.

“ఆ? ఎచ్చగా ఉందా? అయ్యో నా తల్లీ” అంటూ ఎన్న కరిగినట్టు కరిగిపోతూ లచ్చి పొట్టపట్టుకు సూసింది మాణిక్యం.

“పిల్లదానికి కాక తగిలిందిలేయే,” అన్నాడు ముత్తాయ్ లచ్చి మెడకింద సెయిపెట్టి చూస్తూ.

“ఎచ్చగా పొట్టావజానుంటే కాకతగిలిందని ఇంకా మెల్లిగా అంటావేం? తెల్లారి ముక్కు కార్తుంటే అప్పుడే అనుకుండా ఇయ్యాలేందో ఉండదని” అంది మాణిక్యం లచ్చి సేతులూ, ఒంటి మీద బురద కడుగుతూ.

“ఏందే తెల్లారే పొట్టుకుందీ? కాత్తె కసాయం కాసిపోత్తావంటే?” అన్నాడు ముత్తాయ్, ఆడీడ లచ్చి సేసిన బురద తుడుసుకుంటూ.

“నుప్పు సేశాగా ఇప్పుడే కాసిపోత్తా” అంది మాణిక్యం, లోపల్నుంచి ఇంత ఉప్పుగల్లుతెచ్చి లచ్చికి దిష్టితీస్తూ.

“నిన్న రేత్రే మునుసుబు గారు ఊర్నుంచి ఒచ్చారంట. నేను కచేరిసావిడికి ఎల్తుండాగాని పిల్లదాన్ని బయటికెక్కడికీ కదల్నీమాకేవ్” అన్నాడు ముత్తాయ్ సుట్ట ముట్టిచ్చుకుని బయల్దేర్తూ.

“కాత్తె పెందలకాడే తిరిగిరాయ్యా,” అంది మాణిక్యం లచ్చిని చంకకెత్తుకుంటూ.

మాలపల్లి నుంచి గుంటుపల్లికి ఎంతలేదన్నా అరమైలు పైసిలుకుంటుంది. గుంటుపల్లి మునుసుబు కచేరిలో ముత్తాయికి వెట్టిపని. ఈ నౌకరీ ముత్తాయికి ముత్తాతలనాటినుంచీ దొర్లుతూ ఒచ్చిందే. మోతాదు బడేసాయిబు కచ్చేరీలో వేలి ముద్దర్లేయించడం, లెక్కల పుస్తకాలు, సిరాబుడ్లు సరిచూడ్డం, సిస్తు వసూళ్ళకు వారికి వీరికి ఎచ్చరికలు సెయటం మొదలైనవి సూసుకుంటుంటే ముత్తాయి పొలాల కొలతలకూ, టంకు వేసేందుకూ, ఇంకా సిల్లరమల్లర పన్లు సేసేందుకూ ఏర్పాటైనాడు. ఇదిగాక దేవుడిగుడి తిరణాలకు డప్పుకొట్టీ, కాష్టాలకు కట్టెలు మోసీ, పశువులు చస్తే తెచ్చుకుని, ఆటితోళ్ళతో సెప్పులు, ఎద్దుమెళ్ళో పట్టెళ్ళు, సికమార్లు, సెన్నాకోలలు సేసి కుటుంబం గడుపుకుంటున్నాడు ముత్తాయ్.

మాలపల్లి జనం కూలిజనం గనుక పెందరాడే లేస్తారు. వీలుంటే పెళ్ళాలకు సాయంగా ఊరిబయట కుంటలో నీళ్లు తెచ్చి బానలు, బుంగలు నింపి కూడు తిని

కూలిపనికి పొయ్యేవారుపోతే, సీకట్తో లెగసీ లెగవంగానే నెత్తిన పైపంచేసుకుని ఎల్తుర్లో పెళ్లాం, పిల్లజల్లను సూసుకోనన్నా సూసుకోకుండా పనికెల్లిపోతారు కొందరు మాలపల్లి జనం.

"ఓరి ముత్తాయోవ్? ఇయాలేం కచేరీకి మా ఉసిమీనెల్తుండావు మునుసుబుగా రొచ్చారా?" అని వీపుమీద కావిడి బరువుకు నిగడదన్నుకుని కుంటనుంచి బరబరా ఒస్తున్న లచ్చాయ్ కేకేశాడు ముత్తాయిని.

"నిన్న రేత్తిరే ఒచ్చారు మునుసబుగారు. సిస్తు బకాయిలు ఇంకా మిగిలుండయిగా, ఇయాల సానామటుకు వసూలుగావాలి మరి. ఇంకా నువు కూలిపనికి పోకుండా ఈడే కూకుండావేరా? ఇయాల మా మరదలుపిల్ల నీలుపోసి గాని పోనీనని నిలేసిందా ఏరా?" అన్నాడు ముత్తాయ్ కావిడిబద్ద ఊపుకుంటూ దగ్గిర కొచ్చిన లచ్చాయితో.

"అదిగంతేలే. పోనీగందా అని ఏనాడన్నా కుంటనుంచి నాలుగు బుంగ నీలు తెచ్చిపోత్తానా? ఇదిగో ఈవజానంటారు. అందుట్లో నీకు సందు దొరుకుతే సాలు మరదల్ని ఎనకేసుకొత్తావు. నోట్లోకి కాత్తె పుగాకు ముక్కుంటే పెద్దావంట్రా ముత్తాయ్?" అన్నాడు లచ్చాయ్, కావడి బరువుతో కాసేపు ఆగుతూ.

"ఎబ్బె నీ తోడు. ఏలడంటే ఏలెడుంటే ఇంతకు ముంగలే సుట్టసుట్టుకుండా ఉంటే రేప్పెద్దాలే. పిల్లదానికి కాత్తె కాక తగిల్నట్టుందిరా లచ్చాయ్" అన్నాడు ముత్తాయ్.

"చా. ఇంతకు ముంగలే నీ గాబుకాడ నీలు పారబోత్తుంటే సూశాను గదంట్రా ముత్తాయ్? పిల్ల బాగానే ఉండదే? ఇంతలోనే కాకెట్టదగిలిందిరా?" అన్నాడు లచ్చాయ్ నమ్మనట్టు.

"ఆళ్ళమ్మ కేకత్తుంటే ఒచ్చి నాకాళ్ళు వాటేసుకుంటే ఇట్టసూద్దును గందా, ఒళ్ళు ఎచ్చగా ఉంది" అన్నాడు ముత్తాయ్, లచ్చి ఒంటివేడి తన సేతులకు ఇంకా తగుల్తున్నట్టుగా.

"ఓసి, మద్దాన్నానికి అదే జారిపోద్దిలే. మరి పిల్లదానికి నోట్లో కాత్తేమన్నా పోశావా?" అన్నాడు లచ్చాయ్'.

"మీ ఒదినె కసాయం కాసిపోత్తానందిలే" అన్నాడు ముత్తాయ్.

"ఇగనేం, మా మాణిక్కెం ఒదినెకు ఇసువంటి వైద్దికాలు సానా తెలుసు. ఇహ దానంతటదే పోద్దిలే. అదిగో నీ మరదలు దడికాణ్ణుంచి అప్పుడే నిక్కి నిక్కి సూస్తుందది – ఎల్తుండారోయ్ ముత్తాయ్" అంటూ కావడిబద్దతో కిర్ కిర్ ఊక్కుంటూ ఎల్లిపోయాడు లచ్చాయ్.

లచ్చాయ్ గుడిసెదడి దగ్గిర నిజంగానే నిలబడి సూస్తున్న సుబ్బాంవేపు సెయి ఊపుతూ గుంటుపల్లి వేపుకు సాగాడు ముత్తాయ్.

సుబ్బామంటే తనకెంత గురో మధ్య మధ్య అనుకుంటుంటాడు ముత్తాయ్. తనకు మాణిక్యం మీద మనసుమళ్ళి సెడ్డ తపనబడ్తున్న రోజుల్లో సుబ్బాం అతితెలివిగా యవారం పెళ్ళి ఏర్పాటుదాకా నడిపి తనకూ మాణిక్యానికి జోడు కలిపింది. ఇందుకు తనూ, మాణిక్యం నాగారుబొమ్మకు ఓ ఏటపోతును బలిచ్చుకున్నారు గూడా. తన పెళ్ళయి మాణిక్యంతో సుకంగా గడిసిపోతుంటే కొన్నాళ్ళకు సల్లగా నస సాగించింది మాణిక్యం. తనకు పిల్లలు పుట్టకపోవటంవల్ల తనను గొడ్డుమోతని ఒకరిద్ద రనుకోవటం ఇన్నానని మొదులుపెట్టింది మాణిక్యం. కరువులో అదికమాసం అన్నట్టు పిల్లల కోసం ఇప్పట్నుంచీ ఎగబడద్దన్నాడు తను మాణిక్యంతో. ఇప్పటికిప్పుడు పిల్లలు పుట్టకపోతేమటుకు ముందుకు పుట్టరనే ఖరానా ఏమిటని కూడా తను మాణిక్యంతో సానాసార్లు సెప్పి సూశాడు. అయినా మాణిక్యం నస ఆపకపోంగా కనపడ్డ సెట్టుకు పుట్టకు దీపాలెలిగించీ, పాలు పొంగించీ పప్పుబెల్లాలు పెట్టీ, తడిగుడ్డల్తో పెదచ్చినాలు సేసీ సెడ్డ గందరగోళం సేసింది లచ్చి పుట్టేదాకా. లచ్చి పుట్టి మాణిక్యం మళ్ళీ మామూలుదారినపట్టం తన బరువంతా తీసినట్టయింది ముత్తాయికి. ఏమయినా తన పెళ్ళాంకంటే తనకే లచ్చంటే ఎక్కువ ముద్దని మాణిక్యం లచ్చిమీద కేకలేస్తున్నప్పుడల్లా అనుకుంటాడు ముత్తాయ్. అందుకే లచ్చికి ఏ ఇంత ఎచ్చుతగ్గులొచ్చినా కాత్తె కంగారు పట్టం ముత్తాయికి వాల్తీ. అయితే ఏ లచ్చాయిలాంటి మనసుకలిసిన మనిషోగనక ఈపు తడ్తే దైర్నంగా నిలబడిపోయే మనిషే ముత్తాయ్‌గూడా.

మునుసుబుగారింటి కెల్లి దణ్ణాలు పెట్టుకుని, మునుసుబుగారి గొడ్లసావిట్లో గొడ్లకు మేత ఉందో లేదో సూసి, జీతగాడు సావిడంతా బాగుసేసిపోయినా మళ్ళీ ఒకటి రెండు పేడకళ్ళు తీసేసి, మునుసబుగారి పెళ్ళాం సెంద్రమ్మగార్ని పనేమన్నా ఉందదా అని అడిగి, లేదనిపించుకుని, మునసుబుగారు గుడ్డలేసుకుని కచీరుసావిడికి బయలుదేర్తే ఎనికీడ్తే వెళ్తూ, కచీరుసావిడి గుమ్మం దగ్గిరకు సేరి సేతులు కట్టుకుని నుంచున్నాడు ముత్తాయ్.

పెదకరణం, సినకరణం అప్పటికేవచ్చి లెక్కలు రాసుకోవటం ఓరకన్నుతో సూశాడు ముత్తాయ్.

"ఇవాళ సిస్తులు కట్టాలని మొన్న టంకు వేశావుట్రా ముత్తాయ్?" అని కేకేశాడు కచేరిలోంచి మునుసుబుగారు.

"సిత్తం దొరా. తమరు సెప్పినట్టే ఓ పూట పూటంతా టంకేశానండి" అన్నాడు ముత్తాయ్, మునుసుబుగారి కంటికి కొంచెం ఓరగా కనుపిస్తూ.

"మరి ఏరీ ఇంతవరకు ఎవరూ రాలేదేం?" అన్నాడు మునుసుబుగారు విసుగ్గా.

"బడేసాయిబు కేకేసుకురాటానికి ఎల్లాడండి. అదిగో రామయ్యగోరు ఒత్తున్నాడు దొరా" అన్నాడు ముత్తాయ్ రామయ్యకు దారి ఒదుల్తూ.

"ఇవాళే సిస్తుకట్టాలని గాపకమే లేదండి మునసబుగారూ" అంటున్నాడు కచేరిసావిట్లోకి పోయిన రామయ్య.

"ఇదేం మర్యాద రామయ్యా? ఇప్పటికి రెండు వాయిదాలు దాటిపోయినై. ఇంకెన్నిసార్లు టంకు వేయించమంటావో నువ్వే చెప్పు" అని నెమ్మదిగానే అడుగుతున్నాడు మునుసుబుగారు.

"మళ్ళీ టంకు దేనికీ? రెండుమూడు రోజుల్లో పిలవకపోయినా వచ్చి కట్టిపోతే సరిగా" అంటున్నాడు రామయ్య.

"ఒరేయ్ ముత్తాయ్? ఆ రత్తయ్యను వెళ్ళి పిల్చుకురారా – ఊరంతకీ తెలిసినా ఆయనకుమటుకు తెలియలేదంటాడూ?" అని కేకేశాడు మునుసుబుగారు.

"రత్తయ్య బఱ్ఱెగొడ్డు ఇంతకుముంగలే చచ్చిపోయిందంట, మరి ఏం వస్తాడో..." అన్నాడు రామయ్య.

"సరే, చచ్చిన గొడ్డును బతికించటం ఎవరివల్లవుతుంది. రామయ్యా, సర్కారుసొమ్ము కట్టకపోతే పేచీ వస్తుందిగానీ– వెళ్లి కేకేసిరారా ముత్తాయ్?" అన్నాడు మళ్లీ మునుసుబుగారు.

"చచ్చిన బఱ్ఱెగొడ్డు చుట్టూతా తిరుగుతున్న రత్తయ్య కెదురుగా వెళ్ళి నిలబడ్డాడు ముత్తాయ్.

"వెయ్యేళ్లు బతకరా ముత్తాయ్, అనుకుంటుండగానే ఒచ్చావు. ఎటువంటి బఱ్ఱెగొడ్డు చచ్చిందో చూశావా?" అన్నాడు రత్తయ్య విచారంగా.

"తమరి బఱ్ఱెగొడ్డు నాకు తెలవదంటండీ దొరా? మాలావుపుటగ్గలది!" అన్నాడు ముత్తాయ్.

"సరే, బతకనిబిడ్డ బారెడు. మరి దీని సంగతేమంటా? బయటకి చేరేస్తావా" అన్నాడు రత్తయ్య.

"అదేంటి దొరా కొత్తగా మాట్టాడ్తుండారూ? సచ్చినగొడ్డును మేం గాక పోతే ఇంకెవురు తీసికెల్తారూ?" అన్నాడు ముత్తాయి.

"అదిసరేలేవోయ్. కాదని ఎవరన్నారూ? ఇదిగో ముత్తాయ్? ఎందుకంటున్నానో అనుకోవద్దుగానీ– బఱ్ఱె ఖరీదు నాలుగు రూపాయలవుతుంది. తరువాత నీ ఇష్టం" అన్నాడు రత్తయ్య.

"సచ్చినబఱ్రె నాలుగు రూపాయిలా. ఎప్పుడూ ఇన్లేదండి దొరా" అన్నాడు ముత్తాయి, అట్టాగే నోరు తెరుస్తూ.

"ఇప్పుడు వింటున్నావుగా, చచ్చినబఱ్రెయినా నాలుగు డబ్బులు గిట్టుబాటు చేస్తుంటే నాలుగో మూడున్నరో ఇచ్చుకుంటే దండగ కాదుగా?" అన్నాడు రత్తయ్య.

"తమ రట్టంటే మా బీదోళ్ళం గావాలి దొరా. మునుసుబుగోరు తమర్ని కేకెయమంటే ఒచ్చానండి రత్తయ్యగోరూ" అన్నాడు ముత్తాయి.

"విన్నాం లేవోయ్ ఇంతకుముందరే మీ బడేసాయిబును తోలారుగా, మళ్ళీ నువుకూడానా? దాందుంపదెగిరి మరీ ఒకటే ఊదర్రైతే ఎట్లా? ఇదిగో నాచేత నాలుగుసార్లు ఎందుకనిపిస్తావు, దీని విషయ మేమంటావో పైనల్జెసి మద్యాన్నం లోపల తేల్చి చెప్పెయ్, మళ్ళీ ఇంకోర్ని చూసుకోవాలి" అనేసి ఇంటోకి వెళ్ళిపొయ్యాడు రత్తయ్య.

చచ్చిన బఱ్రెగొడ్డు నో సూపు చూసి ఆలోచిస్తూ రత్తయ్య గుమ్మం దిగాడు ముత్తాయ్.

"ఒరే ముత్తాయ్?" అని కేకేశాడు బైస్కోలు బండిమీద ఉసిగా పోతూ బేకునొక్కి ఆగిపోయిన ఆస్పత్రి డాక్టరు.

"దణ్ణాలండి డాటరు దొరా" అన్నాడు ముత్తాయి.

"ఒరేయ్, ఇంట్లో కట్టెలు లేవల్లే ఉంది; వెళ్ళి నేను చెప్పానని చెంచయ్య కొట్లో రెండుగుళ్ల కట్టెలు ఇంట్లో పడేసిపో" అంటూ ముత్తాయి గుక్కతిప్పుకునేలోపే డాక్టరు బై స్కోలు మీద మాయమయ్యాడు.

ఇహ తప్పదు తొందరగా చేసేసి పోదామని చెంచయ్య కొట్టువేపుకు ముత్తాయ్ నాలుగడుగులు వేశాడో లేదో– "ఒరేయ్ ముత్తాయ్ ఒక్కక్షణం ఆగరా?"... అని ఒక ఆడగూతురు గొంతు వినిపించింది.

"అబ్బే ఏం లేదులే, ఏమిటా డాక్టరుగారు నీతో చెప్పిపోతున్నారూ?" అంది సీతారావుమ్మ ఎదురింటి గుమ్మంలో నిలబడి డాక్టరు వెళ్ళిన దిక్కే నిక్కి నిక్కి చూస్తూ.

"ఆఁ ఏం లేదండీ సీతారావుమ్మగోరూ! నాలుగు కట్టెపేళ్ళు ఇంటోపడేసి పొమ్మన్నార్లెండి" అన్నాడు ముత్తాయ్ తొందరపడ్తూ.

"ఆహాఁ అయినా ఆయనేం చెబుతే నాకెందుకులే. ఒక్కసారి ఇటొచ్చిపోరా ముత్తాయ్. కర్మకాలిపోను. తెల్లవారి లేవంగానే నాకీ బ్రహ్మాత్య చుట్టుకుంది. మా దొడ్డో పిల్లి చచ్చింది. నాయన్నాయన కాస్త దాన్ని అటెటైనా పారేసిపోదూ" అంది సీతారావుమ్మ ఆరాటంగా.

"అబ్బో, సానా పన్లుండాయ్ దొర్సానమ్మగోరూ" అనంటున్నాడు ముత్తాయ్.

"వాటికేంలే నీ కెప్పుడూ ఉండేవే. నువు ఇప్పుడు కాదన్నావంటే ఇహ బ్రహ్మదేవుడు దిగివచ్చినా ఆ పిల్లిని నా కంటికి కనపడకుండా తప్పించలేడు. నాయన్నాయన" అంది సీతారావుమ్మ దొడ్డోకి దారితీస్తూ.

సీతారావుమ్మ పిల్లి పనినుంచి బయటపడి, చెంచయ్యకొట్టుకు గబ గబ వెళ్తున్న ముత్తాయికి మాలపల్లి నుంచి ఒస్తున్న ఆదాయ్ కోడలు వీరమ్మ దార్లో ఎదురయింది.

"ఏం ఈరమ్మా బాగుండావా? యాడ కెల్తుండా?" అని పలకరించాడు ముత్తాయ్ వీరమ్మను.

"పిల్ల కాలవగట్టు కెల్తుండాగానీ మీ లచ్చికి కాక తగిలిందంటగా?పిల్ల బురబుర్లాడ్తా అదేమయిన దగ్గుతుండదంటా డాటరుగారికాడ ఏవన్నా మందు తీసుకురామని సెప్పమంది మాణిక్యం" అంది వీరమ్మ.

"ఆఁ కాక బాగా ఎక్కువైందా ఈరమ్మా?" అన్నాడు ముత్తాయ్.

"అదేమో మరి, పిల్ల సూడబోతే కాత్తె నలిగినట్టే ఉంది. ఎందుకైనా మంచిది ఆ డాటరుగార్నడిగి మందిపిచ్చుకుని దబ్బున ఇంటికెళ్ళరాదూ? నేనెల్తుండా నీ తమ్ముడు నా కోసం ఆ పిల్లకాలవగెట్టుమీదే కూకునుంటాడు" అంటూ వెళ్ళిపోయింది వీరమ్మ.

ఇంకొంచెం సేపటికి కట్టెలు తెచ్చి దొడ్లో ఏసి, సెమట తుడుసుకుంటూ ఆస్పత్రిలో డాక్టరుకు కనుపించేట్టు కాత్తె పెడగా నిలబడ్డాడు ముత్తాయ్.

"తెచ్చి పడేశావా?" అన్నాడు డాక్టరు రోగులకు మందులు రాసిస్తూ.

"పడేశానండి, పిల్లదానికి కాక తగిలింది దొరా" అన్నాడు ముత్తాయ్.

"ఏ పిల్లదానికీ?" అన్నాడు డాక్టరు, తలొంచుకుని రాసుకుంటా.

"మా పిల్లదానికేనండి"– అన్నాడు ముత్తాయ్.

"కాక తగిలిందా"– అన్నాడు డాక్టరు.

"అవును దొరా" అన్నాడు ముత్తాయ్.

"ఉహు, సరే కాసేపుండు" అన్నాడు డాక్టరు ఓ జబ్బుమనిషి పొట్ట ఒత్తి చూస్తూ.

"బురబుర్లాడ్తా దగ్గుకూడా బాగా ఉందంటండి దొరా" అన్నాడు ముత్తాయ్. కాసేపు సూసి.

"ఎవరికీ?"... అన్నాడు డాక్టరు, ముత్తాయి నోసారి మళ్ళీ చూస్తూ.

"మా పిల్లదానికేనండి దగ్గూ జరం బాగా ఒచ్చిందండి"... అన్నాడు ముత్తాయ్ కాత్తె గట్టిగా.

"ఏం తిన్నదేం?" అన్నాడు డాక్టరు.

"పిల్లముండ అదేం తింటదండీ నిన్న ఇంతంటే ఇంత ఉల్లికారం, దొగ్గలాకుపప్పు తిన్నదండి" అన్నాడు ముత్తాయ్.

"ఏదీపిల్ల? ఇటు తీసుకురా?" అన్నాడు డాక్టరు.

"పిల్లదాన్ని తీసుకురామంటారండీ?" అన్నాడు ముత్తాయ్ కంగారుపడ్తూ.

"తీసుకురాకపోతే ఎట్లాగయ్యా మందివ్వటం? ఊ వెళ్ళి తీసుకురా"

ఆ నడిరేత్రి ఒళ్ళు తెలియకుండా నిదరపోతున్న ముత్తాయిని లేపింది మాణిక్యం. గబాల్న చూసి ఒణుకుతున్న మాణిక్యం చెయి పట్టుకున్నాడు ముత్తాయ్.

"పిల్ల-పిలుస్తే పలకటం లేదు"... అంది మాణిక్యం సన్నగా వినపడీ వినపడకుండా.

ముత్తాయ్ మంచమ్మీదకు ఒంగి లచ్చి గుండెమీద సెయి పెట్టాడు. "అదేంటే పిచ్చిముండ పిల్ల సుబ్బరంగా నిదరపోతుంటేనూ?" అన్నాడు ముత్తాయ్ మాణిక్యం కెల్లి అనుమానంగా చూస్తూ.

"డొక్క లెగరేగుత్తుండది - మాపిటాల అట్టా లేనేలేదు" అంది మాణిక్యం సన్నగా మూలుగుత.

మైకంలో ఉన్న లచ్చి ఊపిరి పీల్చుకుంటానికి తంటాలుపట్టం నిదానంగా సూసిన ముత్తాయ్ మాణిక్యం కెల్లి బిత్తర సూపులు సూశాడు.

"దాటరిదగ్గర కెల్దాం- పద-" అంది మాణిక్యం.

"ఇంత నిశిరేత్రప్పుడా? దాటరు పలుకుతాడా?" అన్నాడు ముత్తాయ్.

"కాళ్లు పట్టుకుందాం- బగమంతుడే ఉండాడు-"

దారివెంట కుక్క అరుస్తూ వెంటపడ్తుంటే వినిపించుకోకుండా లచ్చిని బుజానేసుకుని ఒచ్చి డాక్టరు తలుపు గబగబ కొట్టారు ముత్తాయ్, మాణిక్యం.

"ఎవరది?" తలుపు తెరిసి బ్యాట్రీలైటు మీదేసి సూశాడు డాక్టరు.

"ముత్తాయిని దొరా- రచ్చించాలి"

"నీకేమన్నా మతుందా లేదా? గాభరా పెట్టి చంపావే?"

"మీ పాదాలు పట్టుకుంటాం దొరా- పిల్లది డొక్క లెగరేత్తుండది."

"ఏడ్చినట్టే ఉంది. మేమేం మనుషుల మనుకున్నారా, పిశాచాల మనుకున్నారా? పగలంతా ఏం చేస్తున్నావ్ ఇంత అర్ధరాత్రి రాకపోతే?"

"తమరు పిల్లదాన్ని మద్దాహ్నం సూసి మందిచ్చారుగందా తగ్గిపోతుందనుకున్నాం దొరా. మరింతలో కొంపమీన కొచ్చుద్దని..."

"చాల్లే రండి లోపలికి..."

సగం నిదరమత్తుతో ఒంగి లచ్చిని పరీక్ష చేస్తున్న డాక్టరు ఒక్కసారి నిటారుగా నుంచున్నాడు.

"మీ అలగా జనానికేం తెలియదు" అన్నాడు డాక్టరు పెళ్లున.

"అదేంది దొరా?-" అన్నాడు ముత్తాయ్. మాణిక్యం ఒక్కసారిగా,

"ఇంజెక్షనివ్వాలి, నాదగ్గిర లేదా ఇంజెక్షను. చీటీ రాసిస్తాను పొన్నూరు వెళ్ళి అర్జెంటుగా తీసుకురావాలి."

"అబ్బో, అంతదూరమా? ఇంత రేత్రి ఎవరు పలుకుతారు డాటరుబాబూ?"... అన్నాడు ముత్తాయ్ నీలుకారిపోతూ.

"తెల్లవారేదాకా ఉండైనా ఇంజెక్షను తీసుకురావాలి- అయిదు రూపాయలు తీసుకుపో"

"అయిదు రూపాయిలా?" అన్నాడు ముత్తాయ్.

"సూడు- పిల్లకు ఇంకా మైకం ఒదల్లేదు- అయ్యోనాలచ్చీ-" అంది మాణిక్యం కోక చెంగు మొహాన కప్పుకుని మూలుగుతూ.

డాక్టరిచ్చిన సిటీ ఒక గుప్పిట్లో పెట్టుకుని, తడువుకోకుండా రెండో సేయి మాణిక్యం మెళ్ళోకి పోనిచ్చి పుస్తెతాడు పటిక్కిన తెంచి - ఇంకొక్క క్షణంలో గుంటుపల్లి వీధులన్నీ దాటి పెద్దకాలవ గట్టెక్కి పొన్నూరు వేపుకు రొప్పుకుంటూ పరుగెత్తాడు ముత్తాయి- సీకట్లో కలిసిపోతూ.

**("భారతి"లో ప్రచురణ)**